నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | KARIMNAGAR

ఆల్ ది బెస్ట్

- ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారయంత్రాంగం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 27 : ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారయంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 28 నుంచి జరగనున్న పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండగా, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉదయం 9 నుంచి 12 గంటలకు వరకు పరీక్షలు జరగనుండగా, నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరించనున్నది. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 67,738 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, వీరి కోసం 127 కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. కాగా, కరీంనగర్ జిల్లాలో ప్రథమ 16,590 మంది, ద్వితీయ 16,959 మంది చొప్పున మొత్తం 33,549 మంది విద్యార్థులు ఉండగా, వీరికోసం 56 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లాలో ప్రథమ 5213 మంది, ద్వితీయ 5891 మంది చొప్పున మొత్తం 11,104 మంది ఉండగా, వీరికోసం 24 కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రథమ 4609 మంది, ద్వితీయ 3934 మంది చొప్పున మొత్తం 8,543 మంది పరీక్ష రాయనుండగా, వీరి కోసం 18 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లాలో మొత్తం 14,542 మంది పరీక్ష రాయనుండగా, వీరి కోసం 29 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఎన్నికల బదిలీలకు బ్రేక్

- స్పష్టత ఇచ్చిన ఎన్నికల సంఘం
- రెవెన్యూ, పోలీస్ విభాగాల్లోని పై స్థాయి పోస్టులకు మాత్రమే స్థానచలనం
- ఉమ్మడి జిల్లాలో ఆగిన 350కిపైగా ట్రాన్స్‌ఫర్లు
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

కరీంనగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల బదిలీలకు బ్రేక్ పడింది. ట్రాన్స్‌ఫర్లలో రోజుకో నిబంధన రావడంతో ఆందోళనకు గురైన అన్ని విభాగాల్లోని అధికారులు, మంగళవారం ఎన్నికల సంఘం నుంచి ఇచ్చిన క్లారిటీతో ఊపిరి పీల్చుకున్నారు. తాజా ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన 350కిపైగా బదిలీలకు బ్రేక్ పడింది. వివరాల ప్రకారం.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీగా బదిలీలు జరుగుతున్న విషయం తెలిసిందే. గతంతో పోలిస్తే ఈ సారి ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి బదిలీలు ఇప్పటికే జరిగాయి. అధికారులు సొంత జిల్లాలో పనిచేయరాదని, అలాగే సర్వీసులో ఏప్రిల్ నాటికి మూడేళ్లు నిండిన వారిని విధిగా బదిలీ చేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియను పూర్తి చేశారు. దాంతో సంబంధిత అధికారులు తమకు కేటాయించిన పోస్టుల్లో జాయిన్ అయ్యారు. బదిలీలు ముగిశాయనుకున్న తరుణంలో ఎన్నికల సంఘం ఈ నెల 23న ట్రాన్స్‌ఫర్లకు సంబంధించి కొత్త నిబంధనను తెరపైకి తెచ్చి ఆదేశాలు జారీ చేసింది. స్థానికతను ఆధారంగా చేసుకొని ఒక లోక్‌సభకు చెందిన అధికారులు.. అదే లోక్‌సభలో ఉండరాదని, సదరు అధికారులను గుర్తించి బదిలీ చేయాలని ఆదేశించింది. ఆ రకంగా చూస్తే.. తాజాగా పోస్టింగ్‌లో చేరిన వందలాది మంది మళ్లీ తట్టాబుట్టా సర్దుకునే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సంఘం ఆదేశాలు కావడంతో ఇక ట్రాన్స్‌ఫర్లు తప్పవనే ఆందోళన కనిపించింది. ఇటు ఈసీ ఆదేశాల మేరకు.. ఉన్నతాధికారులు మళ్లీ బదిలీల జాబితా సిద్ధం చేశారు. పార్లమెంట్ స్థానం ఆధారంగా బదిలీలు చేస్తే క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు తలెత్తుతాయని గుర్తించి ఈ విషయాన్ని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లగా, వారు ఎన్నికల సంఘం దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకెళ్లారు. దీంతో ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. ఈ నెల 23న ఇచ్చిన నిబంధనలకు సడలింపు ఇస్తూ.. కేవలం కొంతమంది ఉన్నత స్థాయి అధికారులకు అది కూడా రెవెన్యూ, పోలీస్ విభాగాలకు మాత్రమే పరిమితం చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. తాజాగా వచ్చిన ఆదేశాల ప్రకారం చూస్తే.. డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ (డీఈవో) అలాగే డిప్యూటీ డీఈవో, ఆర్‌వో, ఏఆర్‌వో, ఐజీ, డీఐజీ, సీనియర్ ఎస్పీ, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ వంటి తత్సమాన పోస్టులకు మాత్రమే నిబంధన వర్తిస్తుందని స్పష్టత నిచ్చింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తాజా ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో సుమారు 359కిపైగా బదిలీలకు బ్రేక్‌పడుతుందని అధికారవర్గాల ద్వారా సమాచారం. అంతేకాదు, ఏదైనా ప్రత్యేక సమస్య, లేదా ఆరోపణలు వస్తే తప్ప.. ఎన్నికల బదిలీలు పెద్ద మొత్తంలో ఉండే అవకాశాలు లేవు. దీంతో ఇటీవలే పోస్టుల్లో చేరిన అధికారులు స్వేచ్ఛగా పనిచేసుకునేందుకు ఆస్కారం ఏర్పడినట్లయింది.

బొమ్మనపల్లిలో కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఢీ అంటే ఢీ

బండి, పొన్నం మాటల యుద్ధం

- కాంగ్రెస్, బీజేపీ మధ్య వాడీవేడి
- మీ అమ్మకు పుట్టావని గ్యారంటీ ఏంటి? అంటూ ప్రజాహిత యాత్రలో బండి వ్యాఖ్యలు
- రెండో రోజూ హాట్ కామెంట్స్
- ఈ మాటే నీ సమాధికి కారణం అవుతుందంటూ పొన్నం ఫైర్
- నాలుక, ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరిక
- సంజయ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న హస్తం శ్రేణులు
- పలు చోట్ల దిష్టిబొమ్మల దహనం
- బొమ్మనపల్లి, రాములపల్లిలో ఉద్రిక్తతల మధ్య ప్రజాహిత యాత్ర

కాంగ్రెస్-బీజేపీ మధ్య ఒక్కసారిగా చిచ్చు రేగింది. మాటలు హద్దులు దాటి దిష్టిబొమ్మల దహనం వరకు వెళ్లింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించి సోమవారం బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య గొడవకు కారణం కాగా, మంగళ వారం చాలాచోట్ల ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ నాయకులు పలుచోట్ల బండి దిష్టిబొమ్మలను దహనం చేయగా.. సంజయ్ మంగళ వారం కూడా పొన్నంపై తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై మంత్రి పొన్నం స్పందించి బండికి కౌంటర్ చేస్తూ ప్రత్యేకంగా వీడియో విడుదల చేశారు. మొత్తంగా ఈ రాజకీయ పరిణామాలు రెండు పార్టీల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. అయితే, ఈ పరిస్థితులు ఎటువైపు దారి తీస్తాయో? అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది.

నీవు మీ అమ్మకు పుట్టావని గ్యారెంటీ ఏంటి?

- పొన్నంపై సంజయ్ తీవ్ర విమర్శలు

బండి సంజయ్ కోహెడలో జరిగిన సభలో రాముడి గురించి ప్రస్తావిస్తూనే పరోక్షంగా పొన్నంపై విరుచుకుపడ్డారు. 'రామాలయం గురించి ఇక్కడి వ్యక్తి కామెంట్ చేస్తున్నడు. రాముడికి సంబంధించి అక్షింతలు వస్తే అవి అక్షింతలు కావు రేషన్ బియ్యమని మాట్లాడుతున్నడు. అక్షింతల్లో ఎవడైనా రేషన్ బియ్యం, బాస్మతి, జై శ్రీరాం బియ్యం అని చూస్తడా..? అలాగే, రాముడు అక్కడే పుట్టిండని గ్యారెంటీ ఏంటని అడుగుతున్నడు. అందుకే మీరు మీ అమ్మకు పుట్టావని గ్యారెంటీ ఏంటి? అని నేనన్న. బిడ్డ పుట్టిన తర్వాత నర్సమ్మ చెబితేనే కదా తెలిసేది. రాముడు అక్కడే పుట్టాడని చెప్పడానికి చరిత్రే ఆధారం. రామాలయం కడితే కూడా వీళ్లకు కడుపు మండుతున్నది. మా రాముడి జన్మస్థలాన్ని, పుట్టుకను ప్రశ్నించే వాళ్లను చెప్పుతో కొట్టాలి' అంటూ పరోక్షంగా పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. 'కొత్తగా మంత్రి అయినవని ఊరుకుంటున్న. మనోడే కదా? అని భరిస్తున్న. కానీ, మా సహనాన్ని చేతగానితనంగా భావిస్తే ఊరుకుంటమా? మా రాముడిని, దేవుడిని కించపరిస్తే మేం భరించాలా' అంటూ ప్రశ్నించారు. 'రాముడిని, అయోధ్య అక్షింతలను కించపర్చినందుకు జనం మిమ్మల్ని ఛీత్కరించుకుంటున్నరు. అయినా మీరు మారకపోతే తగిన బుద్ధి చెబుతరు' అని హితవు పలికారు.

శంకరపట్నం: బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేపట్టారు. ఇప్పటికే మొదటి విడుత పూర్తి చేసి, సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కోహెడ మండలం నుంచి రెండో విడుత యాత్రను ప్రారంభించారు. మొదటి రోజు కోహెడ బహిరంగసభలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. పేరు ప్రస్తావించకుండానే తీవ్రంగా విమర్శించారు. 'రాముడు అక్కడే పుట్టిండని గ్యారంటీ ఏంటని పొన్నం ప్రశ్నిస్తున్నారని, అలాగే విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వచ్చిన అక్షింతలను సైతం అవహేళన చేశారని సంజయ్ మండిపడ్డారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడని అడుగుతున్నడు కదా.. అందుకు నేను ఏమన్నానంటే.. మీరు మీ అమ్మకు పుట్టారని గ్యారెంటీ ఏంటి? అన్నా ను' అంటూ కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు పలుచోట్ల ప్రజాహిత యా త్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో సంజయ్ మంగళవారం ప్రజాహిత యాత్రలో భాగంగా మరోసారి ఫైర్ అయ్యారు. తన యాత్రకు పొన్నం ప్రభాకర్ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూనే.. ఆయనకు సవాల్ విసిరారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నేను ఏం చేశానో ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లోకి వెళ్తున్న. కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో, మోదీ ఏం చేశారో చెబుతున్న. రాము డు అయోధ్యలో పుట్టాడనడానికి ఆధారాలేంటని కించపర్చే వారిని ప్రశ్నిస్తూ జనంలోకి వెళ్తున్న. మీకు దమ్ముంటే.. ఇదే మీ విధానాలు, మీ నినాదాలతో ఎన్నికల్లోకి రండి. కరీంనగర్‌లో నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంట. కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే నీవు మంత్రి పదవికి రాజీనామా చేస్తవా..? రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పకుంటవా..?' అని సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతగాక కాంగ్రె స్ మూకలను పంపి ప్రశాంతంగా సాగుతున్న యాత్ర లో విధ్వంసం సృష్టించాలనుకుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని పొన్నంను హెచ్చరించారు. 'ఇక్కడున్న మంత్రి ప్రతీసారి హల్‌చల్ చేయాలని చూస్తున్నడు. ప్రతిదాంట్లోనూ ఇన్‌వాల్వ్ అవుతున్నడు. నాకో డౌటొస్తున్నది. గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిండు. ఇప్పుడు సీఎంగా ఉన్నందున ప్రజలను రెచ్చగొడుతూ శాంతి భద్రతల సమస్య తలెత్తేలా చేస్తున్నడేమోనని అనుమానంగా ఉన్నది. రేవంతన్నా జాగ్రత్తగా ఉండు' అని సూచించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టారని చరిత్ర చెబుతున్నది. సాక్షాత్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా ఆధారాలు ఏంటని వితండవాదం చేస్తున్న వాళ్లను నేనడుగుతున్న. మీరు మీ అమ్మకే పుట్టారనడానికి ఆధారాలేంది? అట్లాగే నేను కూడా మా అమ్మకే పుట్టాననడానికి ఆధారాలేంది? అక్కడున్న నర్స్, డాక్టర్లు చెబితేనే కదా తెలిసేది? నేను నిన్న కూడా అదే చెప్పిన. అందులో తప్పేమున్నది? బరాబర్ మళ్లీ అంట' అని సంజయ్ స్పష్టం చేశారు. కానీ, సాయం త్రం వరకు మరో ప్రకటన చేశారు. 'పొన్నం ప్రభాకర్ తల్లికి పాదాభివందనం చేస్తున్న. అమ్మా.. నేను నిన్ను కించపరిచేలా ఒక్క మాట కూడా అనలేదు. మా అమ్మలాగే మీరు కూడా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలి. నేను అనని మాటల్ని మీకు ఆపాదించి అవమానిస్తున్నడు. మీ పేరును రాజకీయంగా వాడుకుంటూ మానసిక క్షోభకు గురి చేస్తున్నడు' అని చెప్పుకొచ్చారు. ఇటు సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రత్యేకంగా ఓ వీడియోను విడుదల చేసి, బండి అప్పుడే రాజకీయ డ్రా మాలు మొదలు పెట్టారంటూ ఘాటుగా విమర్శించా రు. ఎంపీగా గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గానికి ఏమి చేశావో చెప్పాలని నేను రాజకీయంగా ప్రశ్నిస్తుంటే.. ఆయన మాత్రం నా తల్లి గురించి మాట్లాడుతున్నడు' అంటూ మండిపడ్డారు. రాముడి గురించి చెప్పడమే కాదు, వారికి ఉన్న సంస్కారం వీరికి ఉండాలి కదా? అని ప్రశ్నించారు. బండి యాత్రను ఎవరూ అడ్డుకోవడం లేదని, కావాలనే ప్రాపగండ కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.

కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు

బండి అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు భగ్గుమన్నారు. సోమవారం రాత్రే నిరసనలు తెలిపారు. మంగళవారం పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. చిగురుమామిడి బస్టాండ్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేసి, ఎంపీకి వ్యతిరేకంగా నినదించారు. అంతకుముందు ఉల్లంపల్లి, హుస్నాబాద్ రహదారి మధ్య ఆందోళన చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. కరీంనగర్‌లో దిష్టిబొమ్మను దహనం చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సంజయ్‌పై చర్యలు తీసుకోవాలంటూ చిగురుమామిడి, హుజూరాబాద్, హుస్నాబాద్ ఠాణాల్లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. మరోవైపు కాంగ్రెస్ శ్రేణుల తీరుపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజయ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు.

ఉద్రిక్తతల నడుమ యాత్ర

బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి, హుస్నాబాద్ మండలం రాములపల్లిలో ఘర్షణ వాతావరణం కనిపించింది. సోమవారం రాత్రి బొమ్మనపల్లిలో సంజయ్ బస చేసిన క్యాంపును ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉదయాన్నే తరలివచ్చారు. అక్కడే ఉన్న బీజేపీ నాయకులు ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడగా, పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. అలాగే విషయం తెలిసి క్యాంపునకు వెళ్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత పోలీసుల అనుమతితో యాత్ర ముందుకు సాగగా, రాములపల్లిలో కాంగ్రెస్ నాయకులు యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎలాంటి అవాంతరాలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కరీంనగర్: తెలంగాణ చౌక్‌లో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమాజం ఆలోచించాలి

- బండి వ్యాఖ్యలపై పొన్నం ఫైర్

మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రత్యేకంగా ఓ వీడియో విడుదల చేశారు. అందులో సంజయ్ వ్యాఖ్యలపై ఘాటుగా విమర్శించారు. 'ఎన్నికల ప్రచారాన్ని పురస్కరించుకొని బండిని నేను ప్రశ్నించిన. ఐదేళ్ల ఎంపీ పదవీ కాలంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశావో చెప్పి ప్రచారం చేయాలని డిమాండ్ చేసిన. శ్రీరాముడి పేరిట ఓట్లు అడగడం కాదు, చేసిన అభివృద్ధి ఏంటని అడిగిన. ఆయన మాత్రం నా తల్లి, నా జన్మకు సంబంధించిన మాటలు మాట్లాడిండు' అంటూ మండిపడ్డారు. 'జన్మనిచ్చిన తల్లి. అది నా తల్లి కావచ్చు లేదా ఇంకొకరి తల్లి కావచ్చు. కానీ, నేను అభివృద్ధిపై ప్రశ్నిస్తే ఆయన మాత్రం నా తల్లి, నా జన్మకు సంబంధించి మాట్లాడిండు. ఇది ఎంతవరకు సమంజసం? సభ్య సమాజం ఆలోచించాలి' అని కోరారు. ఆయన యాత్రను, ప్రచారాన్ని ఎవరో అడ్డుకుంటున్నట్టు రాజకీయ డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు ఉన్నదని, తామెవ్వరం అడ్డుకోవడం లేదని స్పష్టం చేశారు. 'మీరు మాట్లాడిన మాటలపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని అంటున్నరు. ప్రజలే మనకు చట్టం. ప్రజాస్వామ్యమే మనకు చట్టం. ఈ ప్రజల ముందు నేను అడుగుతున్న. ఈ ప్రజాస్వామ్యం సాక్షిగా అడుగుతున్న. ప్రతి బిడ్డకూ జన్మనిచ్చేది ఓ తల్లే. నా తల్లి, నా జన్మ గురించి మాట్లాడుతున్న సంజయ్‌పై ఆలోచన చేయండి' అని కోరారు. 'భార్యకు మంగళసూత్రం కడుతరు. అటువంటి మంగళసూత్రం అమ్మి ఎన్నికల్లో గెలిచిన అనే వ్యక్తి నా తల్లి గురించి, నా జన్మ గురించి మాట్లాడడం ఏం రాజకీయం?' అని ప్రశ్నించారు. 'బీజేపీ రాష్ట్ర, కేంద్ర నాయకులు ఆలోచించాలి. మీరు ఈ నాయకుడి మాటలను సమర్థిస్తున్నారా..? బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేయాలి' అని డిమాండ్ చేశారు. 'ఈ జిల్లాకు సంబంధించి ఇతర బీజేపీ నాయకులను అడుగుతున్న. ఈ నియోజకవర్గానికి సంబంధించి ఐదేళ్లలో మీరేం చేశారు? నేను ఎంపీగా ఉన్నప్పుడు నేనేం చేశాను? అన్నదానిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని ఏడాదికాలంగా అడుగుతున్న. కానీ, సంజయ్ నియోజకవర్గంలో ఏం చేయలేదని, ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని, ఓడిపోతాననే భయంతో ఇటువంటి ప్రస్తావన తెచ్చి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నడు' అని మండిపడ్డారు. 'గత ఎంపీ ఎన్నికల సమయంలో కేసీఆర్ హిందుగాళ్లు బొందుగాళ్ల అన్న మాటలను నీ గెలుపునకు ఏ విధంగా రాజకీయంగా వాడుకున్నావో అందరికీ తెలిసిందే. ఈరోజు నీవు మాట్లాడిన తల్లి మాట నీ రాజకీయ సమాధికి కారణం కాబోతుంది బండి సంజయ్. జాగ్రత్త' అని హితవు పలికారు. 'మేం హింసావాదులం కాదు, కాంగ్రెస్ పార్టీ వాళ్లం. మేం నీ యాత్రకి అడ్డుపడతలేం. శవం మీద పేలాలు ఏరుకునే రకంగా యాత్రను అడ్డుకుంటున్నారని చెబుతూ రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేయకు. యాత్ర చేసుకో.. ఇంకా ఏమైనా చేసుకో.. కానీ, నాలుక ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు సంజయ్' అని హెచ్చరించారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

బండి సంజయ్‌కి కరీంనగర్ ఏమైనా పునరావాస కేంద్రమా?

- అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన ప్రతీసారి పార్లమెంట్‌కు పోటీనా?
- గడిచిన ఐదేళ్లలో ఏం సేవ చేసిండు?
- ఓ కార్యకర్తగా మీకు అందుబాటులో ఉంటా
- విశ్వాసంతో పని చేస్తే మనదే విజయం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- వేములవాడలో నియోజకవర్గ సర్వసభ్య సమావేశం

వేములవాడ, ఫిబ్రవరి 27: కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన ప్రతిసారి బండి సంజయ్ పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేయడానికి కరీంనగర్ ఏమైనా పునరావాస కేంద్రమా..? అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. గడిచిన ఐదేళ్లలో ఎంపీగా ఆయన కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు ఏ మాత్రం సేవ చేయలేదని, వారి పార్టీకి మాత్రమే సేవ చేశారని ధ్వజమెత్తారు. దేశంలో దీటైన ప్రతిపక్షం లేక కేంద్రంలోని బీజేపీ అతి విశ్వాసంతో ఉందన్నారు. వేములవాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వేములవాడ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశం పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన నిర్వహించగా, పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామ, మండలస్థాయి కమిటీల సభ్యులు, నాయకులు ముఖ్య కార్యకర్తలు దాదాపు 1500 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రేణులను ఉద్దేశించి వినోద్‌కుమార్ ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నిలక ఫలితాల తర్వాత ఓటమిపై 20 రోజులు అధ్యయనం చేశామని చెప్పారు. జరిగిన తప్పిదాలను సరిదిద్దుకొని ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. గులాబీ పార్టీ పుట్టినరోజు కూడా ఎంతోమంది ఉంటదా..? అని అవహేళన చేశారని గుర్తుచేశారు. పార్టీ అధినేత కేసీఆర్ సారథ్యంలో కానిది అయ్యేలా సాధించింది గులాబీ పార్టీ యేనని స్పష్టం చేశారు. తలాపున పారుతున్న గోదావరిని 400 మీటర్లకు ఎత్తి కోటి ఎకరాలకు సాగు నీరు అందించారన్నారు. గతంలో ప్రకాశం బ్యారేజ్, బంగ్లాదేశ్-కలకత్తా సరిహద్దులో ఉన్న బ్యారేజ్‌లు కొట్టుకపోతే రిపేర్ చేయలేదా? అని ప్రశ్నించారు. 86 పిల్లర్లతో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగితే రేవంత్ ప్రభుత్వం ఎందుకు మరమ్మతులు చేయడం లేదని నిలదీశారు. ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకపోయి చంద్రబాబుకు నీళ్లు అందాలనే కుట్రపూరితమైన కోణం ఉందని ఆరోపించారు. రోజూ ఐదు వేల క్యూసెక్కుల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఏనాడైనా ఒక మంచి పని చేశాయా అని ప్రశ్నించారు. బీజేపీ నుంచి కేంద్ర మంత్రులుగా ఉండి కూడా ఏమీ ఒరగబెట్టలేదని మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు రైలును తీసుకరావడమే కాకుండా మోదీతో శంకుస్థాపన చేయించానని గుర్తు చేశారు. రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి పట్టణం వరకు బలమైన పార్టీగా బీఆర్ఎస్ ఉందని, మనకు ఉన్న శక్తి కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. ప్రజల మీద ప్రేమాభిమానాలతో నడుచుకొని, విశ్వాసంతో పనిచేస్తే మళ్లీ విజయం మనదే అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఒక కార్యకర్తగా, నాయకుడిగా అందుబాటులో ఉంటానని, ఎప్పుడు ఏ సమస్య ఉన్నా సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవం ఇష్టపడని వ్యక్తి రేవంత్

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఇష్టపడని వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి. సమైక్యవాదం అనే పర్వతాన్ని ఎత్తి బయటపడేసిన శక్తి బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ ప్రజలది. ఆంధ్రా పార్టీలను, ఢిల్లీని గడగడలాడించి రాష్ట్రాన్ని కేసీఆర్ నాయకత్వంలో సాధించుకున్నాం. రేవంత్‌రెడ్డి ఎవరి శిష్యుడో మనకందరికీ తెలుసు. ఆయనకు ఓనమాలు నేర్పిన చంద్రబాబుకు మనం మూడు చెర్ల నీళ్లను తాగించాం. ఉద్యమం తీవ్రం కాకపోతే కరీంనగర్‌కు వచ్చిన సోనియాగాంధీ.. మీ మనస్సులో ఏమున్నదో నాకు తెలుసు? అని ఎందుకు అన్నదో కాంగ్రెస్ నాయకులకే తెలియాలి. తెలంగాణ పోరాట చరిత్రను సీఎం రేవంత్‌రెడ్డి మలిపి వేయాలనుకుంటున్నారు. నాడు ఉద్యమంలో ఆయన పాత్ర ద్రోహం మాత్రమే ఉన్నందున కుట్ర పన్నుతున్నారు. పరిపాలన సౌధం ఎదుట ఆత్మగౌరవానికి ప్రతీకైన తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని కేసీఆర్ సంకల్పిస్తే.. ఢిల్లీ అడుగులకు మడుగులు ఒత్తే రేవంత్.. రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలనుకోవడం తెలంగాణపై ఉన్న వివక్షకు నిదర్శనం. ప్రభుత్వ లోగోను తప్పు పడుతూ కాకతీయుల సంస్కృతిని కాదంటున్న ఆయన పనితీరుపై ఉన్న పరిజ్ఞానం ప్రజలు అర్థం చేసుకోవాలి. తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష అని గుర్తుంచుకోవాలి.

- దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ

వినోద్‌కుమార్ గెలుపుకోసం శ్రమించాలి

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో వినోద్‌కుమార్ గెలుపుకోసం ప్రతి కార్యకర్తా శ్రమించాలి. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు నేను అందుబాటులో ఉండి అండగా ఉంటా.

- చల్మెడ లక్ష్మీనరసింహారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి

హాజరైన నాయకులు, కార్య